ఈఎస్‌ఐలో అందని వైద్య సేవలు

- మిర్యాలగూడ డిస్పెన్సరీలో ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్న వైద్యులు
- ఇబ్బందులు పడుతున్న కార్మిక కుటుంబాలు



మిర్యాలగూడ ఈఎస్‌ఐ డిస్పెన్సరీ

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలో వాణిజ్య కార్యకలాపాలు ఊపందుకోవడం.. అందుకనుగుణంగా అనేక పరిశ్రమలు ఏర్పాటు, రైస్ ఇండస్ట్రీస్‌లో ఆసియా ఖండంలోనే నంబర్‌గా మిర్యాలగూడ నిలిచింది. దీంతో ఆయా పరిశ్రమల్లో కార్మికులు పెరిగిపోయారు. కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు ఉపయోగపడే విధంగా ఉండేందుకు వారి ఆరోగ్యం కాపాడేందుకు మిర్యాలగూడ పట్టణంలో 2013లో గుత్తా సుఖేందర్‌రెడ్డి చొరవతో ఈఎస్‌ఐ డిస్పెన్సరిని ఏర్పాటు చేశారు.

రోజుకు వందల్లో రోగులు..

కాగా ఈఎస్‌ఐ డిస్పెన్సరీకి రోజుకు వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. వంద నుంచి రెండు వందలకు పైగా వచ్చే రోగులను పరిక్షించేందుకు ఇద్దరు వైద్యులను నియమించిన ప్రభుత్వం రోగులకు అవసరమైన ఆపరేషన్లు, అడ్మిట్ అయ్యే రోగులు వస్తే వారికి వైద్యం అందడం కష్టంగా మారింది. నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, దేవరకొండ, నాగార్జునసాగర్, హాలియా, నేరేడుచర్ల పట్టణాల నుంచి ఈఎస్‌ఐ కార్డు కలిగిన వేలాదిమంది కార్మికులు ఆస్పత్రికి వస్తుండగా.. ఆస్పత్రికి వచ్చే గర్భిణులు నెలకు 20మందికి పైగా వస్తుంటారు. అంతేగాకుండా కార్మికులు గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతూ నెలకు సుమారు 30మందికి పైగా వస్తున్నారని సమాచారం. కేవలం డిస్పెన్సరీ కావడంతో అత్యవసరంగా వచ్చే రోగులకు ఎలాంటి వైద్యం అందించలేని పరిస్థితిలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఉందని కార్మికులు వాపోతున్నారు.

అద్దె భవనంతోనూ ఇక్కట్లే..

కాగా ఈఎస్‌ఐ డిస్పెన్సరీ ఆస్పత్రి అద్దె భవనంలో సాగుతుండటంతో అనేక అబ్బందులు పడుతున్నారని సకాలంలో అద్దె బిల్లులు విడుదల కాకపోవండతో భవన యజమాని ఆస్పత్రికి తాళం వేసిన సంఘటనలూ చోటు చేసుకుంటున్నాయి. పారిశ్రామికంగా అబివృద్ధి చెందిన పట్టణంలో 50 పడకలు కలిగిన సొంత భవనాన్ని నిర్మించి అన్ని మౌలిక వసతులు కల్పించాలని, అందుకు సరిపడా వైద్యులను నియమించి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం అందేలా పాలకులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని వివిధ పరిశ్రమలలో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారని వారందరికి వైద్యం అందించేందుకు ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అప్‌గ్రేడ్ చేయాలి



మిర్యాలగూడ పట్టణంలో ఉన్న ఈఎస్‌ఐ డిస్పెన్సరీకి సొంత భవనం నిర్మించడంతో పాటు డిస్పెన్సరీ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసి 50 పడకల ఆస్పత్రిగా మార్చాలి. కార్మికుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులను నియమించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి. అత్యవసర చికిత్స కోసం రోగులు వస్తే ఇతర ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– గుడిపాటి సైదులుబాబు , మిర్యాలగూడ

ఉపాధ్యాయుల కల నెరవేర్చిన కాంగ్రెస్

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : 15 ఏళ్ల ఉపాధ్యాయుల కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న సమావేశానికి మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి వెళ్లే ఉపాధ్యాయుల వాహనాలకు శుక్రవారం స్థానిక ఎన్నెస్పీ క్యాంప్ గ్రౌండ్‌లోని వాహనాలకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించారని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తమకు మేలు జరుగుతుందని భావించారని, పదేళ్ల కాలంలో ఉపాధ్యాయులకు అన్యాయమే జరిగిందన్నారు. కాని ఉపాధ్యాయుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించి రాష్ట్రంలోని 30వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతు కల్పించి వారికి అండగా నిలబడ్డారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎండి.యూసుఫ్, ఎంఈఓ బాలాజీనాయక్, ఎంపీడీఓ శేషగిరిశర్మ, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్‌నాయక్, మంగ్యానాయక్, కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం


హాలియా : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రామకృష్ణ

మిర్యాలగూడ టౌన్ : తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని మిర్యాలగూడ అర్బన్ సీడీపీవో రేఖ మమత, కౌన్సిలర్‌లు ముదిరెడ్డి నర్సిరెడ్డి, చల్లా నాగమ్మవెంకన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఈదులగూడెంలో గల 1,2,3,4 ముత్తిరెడ్డికుంట అంగన్‌వాడీ -3 కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం ఈదులగూడెంలో సీడీపీఓ రేఖ మమత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బంగారుగడ్డ పీహెచ్‌సీ డాక్టర్ సంజయ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజిమా, అంగన్‌వాడీ టీచర్లు బొందు పార్వతి, సీహెచ్ రామానుంజమ్మ, ఎం లలితమ్మ, రజిత, ఎఎన్ఎం విజయ. ఆశావర్కర్ నవ్య, ప్రవంతి, అంగన్వాడీ ఆయా వసియాబేగం, అంజమ్మ ముత్తిరరెడ్డి కుంట అంగన్‌వాడీ టీచరు బెజ్జం నాగమణి, ఆయా సైదమ్మ, పుష్పమ్మ, ప్రమీల, అమీరా, అజ్వర్య, స్వప్న, చందన, తల్లులు జ్యోతి, ధనలక్ష్మి, జయమ్మ తదితరులున్నారు. అదే విధంగా పట్టణంలోని ప్రకాశ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలాకుమారీ, అంగన్వాడీ టీచర్లు శారధ, కోమల, ఆయాలు సైదమ్మలతోపాటు గర్భిణులు, బాలింతలు తదితరులున్నారు.

కొండమల్లేపల్లి : అప్పుడే పుట్టిన శిశువుకు తల్లిపాలు తాగించాలని ఏసీడీపీఓ పి.సరళ అన్నారు. శుక్రవారం కొండమల్లేపల్లి-1 సెంటర్‌లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు చేశారు. పుట్టిన శిశువులకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే తాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిప్పర్తి రాధ, అంగన్‌వాడి టీచర్లు కె.శోభారాణి, వి.జ్యోతి, ఎన్.సుశీలన, సిహెచ్.మాణిక్యమ్మ పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలి

హాలియా : పుట్టిన ప్రతీ బిడ్డకు ముర్రుపాలు తాగించాలని హాలియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రామకృష్ణ అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అనుముల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో తల్లులకు, కిశోర బాలికలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనసూయ, సీహెచ్‌ఓ తావుర్య, ఏసీడీపీఓ సువర్ణ, సూపర్‌వైజర్ రమాదేవి, ఏడబ్ల్యూటీఎస్ సుజాత, మంజుల, విజయలక్ష్మి, కల్పన, నర్మద, వజ్రమ్మ, పుష్ప, హనిమి, వర్షన, బాజీదాబేగం, గౌస్యాబేగం, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్): తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని, బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలను పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ అన్నారు. మండలంలోని రాజవరం సెక్టారు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ యాదమ్మ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లివద్ద ముర్రుపాలు పాట్టించడం వలన పిల్లల్లో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. బిడ్డపుట్టిన నాటి నుంచి రెండేళ్ల వరకు పాలు పట్టించాలని, కనీసం ఆరు నెలల వరకు తల్లిపాలను పట్టించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు లీలావతి, నాగమణి, లలిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మిర్యాలగూడ వాసికి డాక్టరేట్


పెంటమళ్ల లావణ్య

మిర్యాలగూడ టౌన్ : పట్టణానికి చెందిన పెంటమళ్ల లావణ్య ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో డాక్టరేట్‌ను పొందింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లైబ్రరీ ఉస్మానియా యూనివర్సిటీ, లైబ్రరీయన్ డాక్టర్ ఆర్‌కె పవన్ కుమార్(రిటైర్డ్) పర్యవేక్షణలో 'ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా లైబ్రరీ సర్వీసెస్ ఫర్ జర్నలిస్ట్ ఇన్-హైదరాబాద్' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసింది. పెంటమళ్ల లావణ్య ఈ పరిశోధన గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారులు ఆమెకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. డాక్టరేట్ సాధించిన లావణ్యను విభాగం హెడ్ డాక్టర్ వివేక్వర్ధన్, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్ యాదగిరి, డాక్టర్ ఏఎస్ చక్రవర్తి, సీటి కళాశాల లైబ్రరీయన్ డాక్టర్ చేగోని రవికుమార్, ఎన్‌జీ కళాశాల లైబ్రరీయన్ డాక్టర్ ఎ. దుర్గాప్రసాద్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

దేవాలయ నిర్మాణానికి రూ.10లక్షల విరాళం

చింతపల్లి : మండల పరిధిలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయంలో శివాలయ గుడి నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన నల్ల సుమితరఘుమారెడ్డి రూ.10లక్షలను శుక్రవారం దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సుమితరఘుమారెడ్డి దంపతులను దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులు సన్మానించారు.

తిరుమలగిరి(సాగర్) ఎస్‌ఐగా శ్రీను నాయక్


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ శ్రీను నాయక్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండల నూతన ఎస్‌ఐగా శ్రీను నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన నా రాయణరెడ్డి నల్ల గొండ వీఆర్‌కు అటాచ్ కాగా మిర్యాలగూడ వన్‌టౌన్ ఎస్‌ఐగా పని చేస్తున్న శ్రీను నాయక్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ శ్రీను నాయక్‌కు పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

డీజిల్‌లో కిరోసిన్ కలిసిందంటూ నిలదీత

మిర్యాలగూడ టౌన్ : తన వాహనంలో పోసిన డీజిల్‌లో కిరోసిన్ కలిందంటూ శుక్రవారం మండలంలోని వెంకటాద్రిపాలెం వద్ద గల పెట్రోల్ బంక్ నిర్వాహకులను ఒక వ్యక్తి నిలదీశాడు. వివారాల్లోకి వెళ్లే.. నేరేడుకొమ్మ మండలం బచ్చాపురం గ్రామానికి చెందిన రూప్లా అనే వ్యక్తి గురువారం మిర్యాలగూడలోని తమ బంధువుల ఇంటికి వచ్చి వెళ్లే సమయంలో వెంకటాద్రిపాలెం సమీపంలోని ఒక పెట్రోల్ బంక్‌లో 10లీటర్ల డీజిల్ తన టాటా ఏస్ వాహనంలో పోయించుకున్నాడు. హాలియా సమీపంలోకి రాగానే ఆటో మొరాయించడంతో మెకానిక్ చూపించగా డీజిల్‌లో కిరోసిన్ కలిదంటూ చెప్పడంతో రూప్లా తన ఆటోను బాగు చేయించుకొని తన ఇంటికి వెళ్లాడు. తిరిగి శుక్రవారం బంక్ వద్దకు వచ్చి సిబ్బందిని, బంక్‌కు సంబంధించిన వారిని నిలదీశాడు. దీంతో సరైనా సమాధానం చెప్పకపోవడంతో ఒక బాటిల్ ఇదే బంక్‌కు సంబంధించిన డీజిల్, మరో బంక్‌లో డిజిల్ కోట్టించి చూడగా కిరోసిన్ కలిసి ఉందని మీడియాకు వివరించారు. ఈ విషయంపై తాను రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని తెలిపాడు.

పింగళి వెంకయ్యకు నివాళి

మిర్యాలగూడ టౌన్ : జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని మండలంలోని జప్తీ వీరప్పగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఘనంగా నిర్వహించారు. అనంతరం వెంకయ్య చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. కోటయ్య, వై. దామోదర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, జల్‌రాం ఉన్నారు.

మానవత్వం చాటుకున్న కొండమల్లేపల్లి ఎస్‌ఐ


వృద్ధుడిని ప్రథమ చికిత్స కోసం తీసుకెళ్తున్న ఎస్‌ఐ

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి వెళ్తున్న సమయంలో హార్టికల్చర్ కార్యాలయం వద్ద రోడ్డు మీద వృద్ధుడు పడి ఉండటాన్ని కొండమల్లేపల్లి ఎస్‌ఐ గమనించాడు. దీంతో ఆ వృద్ధుడిని దగ్గరుండి తన వాహనంలో తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించాడు. అనంతరం వృద్ధుడిని పెండ్లిపాకల గ్రామానికి చెందిన ఆచారిగా గుర్తించారు. వృద్ధుడికి ఆహార పదార్థాలు, పండ్లు ఇప్పించి పోలీసు వాహనంలో గ్రామంలోని వృద్ధుడి బంధువుల ఇంటి వద్దకు చేర్చగా ఇంటి వద్ద ఎవరూ లేరని సమాచారం.

వరదకాల్వలో చెట్లు తొలగించాలని ఆందోళన


వరదకాల్వ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

వేములపల్లి (మాడుగులపల్లి) : మాడుగులపల్లి మండలంలోని వరదకాల్వలో పేరుకపోయిన చెట్లను, ముళ్లకంపను తొలగించి వెంటనే సాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వరదకాల్వలో పేరుకపోయిన పిచ్చి మొక్కలను, ముళ్ల కంప చెట్లను పరిశీలించి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ఎండాకాలంలో ఉపాధి హామీ పథకం కింద వరదకాల్వలో ఉన్న చెట్లను, ముళ్లపొదళ్లను తొలగించి ఉంటే ప్రస్తుతం సాగర్ నుంచి వరద కాల్వలోకి త్వరగా చేరి చివరి ఆయకట్టుకు నీరు తొందరగా చేరే అవకాశం ఉందన్నారు. కాని కాల్వలో పెద్దపెద్ద చెట్లు, ముళ్లపొదలు ఉండడంతో నీరు రావడానికి చాలా ఇబ్బంది అవుతుందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెట్లను తొలగించాలన్నారు. వరదకాల్వ కింద రైతులు పెద్ద ఎత్తున నారుమడులు పోసుకోని సిద్ధంగా ఉన్నారని, రెండు, మూడు రోజుల్లో సాగర్ కాల్వ నిండే అవకాశం ఉన్నందున వరదకాల్వ ద్వారా మాడుగులపల్లిలోని తోపుచర్ల, సల్కునూరు చివరి వరకు నీరందే అవకాశం ఉన్నందున వెంటనే అధికారులు స్పందించి చెట్లను తొలగించి నీరు సజావుగా పారేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, శ్రీను, శ్రీకర్, సీతారాంరెడ్డి, చంద్రయ్య, వెంకట్‌రెడ్డి, సైదిరెడ్డి, సైదులు, నాగయ్య, పరుశురాములు పాల్గొన్నారు.

'చేయూత'ను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ టౌన్ : గుండెపోటుతో మృతి చెందిన ఒకేషనల్ సీపీఎస్ రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎద్దు ఉపేందర్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఆదివారం పట్టణ కేంద్రంలో నిర్వహించనున్న చేయూత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెళ్లి ఉపేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు దొంతిరెడ్డి పంకజ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎస్ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. భద్రత లేని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు బాసటగా నిలిచి అందరి సహకారంతో రూ.3లక్షలను అందించేందుకు ఈ చేయూత కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఎంవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్లమెంటు సభ్యులు రఘువీర్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎమ్మెల్సీ మల్లన్న, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, సంఘం జిల్లా కోశాధికారి అందుగుల విజయ్, కొరివి కృష్ణ, ఫారూఖ్, , ఉదయ్, యోగేందర్, శేఖరయ్య తదితరులున్నారు.

ఎడమకాల్వకు మరమ్మతులు చేపట్టాలని వినతి


ఈఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు

మిర్యాలగూడ : బలహీనంగా ఉన్న చోట సాగర్ ఎడమకాల్వ కట్టకు అధికారులు మరమ్మతులు చేపట్టాలని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌ఎస్పీ ఈఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. గతంలో నిడమనూరు సమీపంలో ఎడమకాల్వకు గండి పడడంతో వందలాది ఎకరాలు నీట మునిగి రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ వరకు కాల్వ లైనింగ్, బిడ్డింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉండగా అధికారుల అలసత్వం , కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు పూర్తికాకపోవడంతో కట్ట బలహీనంగా మారి గండ్లు పడే ప్రమాదం ఉందని అన్నారు. వేములపల్లి – అన్నపరెడ్డిగూడెం మధ్య, మిర్యాలగూడ మండలం కురియాతండా వద్ద ఎడమకాల్వ కట్ట బలహీనంగా ఉందని వెంటనే లైనింగ్ పూర్తి చేయాలని అన్నారు. కాల్వపై ఉన్న మేజర్లు, ఎత్తిపోతలను పూర్తిస్థాయిలో పర్యవేక్షించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు చలమల సీతారాంరెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎడ్ల రమేష్, బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రావు, నాయకులు పురుషోత్తంరెడ్డి, ప్రసాద్, సరిత, హనుమంతరెడ్డి, పాల్గొన్నారు.

చెరువు కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

హాలియా : మండలంలోని అనుముల, తిమ్మాపురం రెవెన్యూ శివారులో ఉన్న రామసముద్రం చెరువును ఒక వ్యక్తి కబ్జా చేసి అక్రమంగా ఆక్రమించారని అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ రామసముద్రం మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులు శుక్రవారం మండల తహసీల్దార్ జయశ్రీకి వినతి పత్రం అందజేశారు. అనుముల, తిమ్మాపురం రెవెన్యూ గ్రామ సరిహద్దులో ఉన్న రామసముద్రం చెరువును ఒక వ్యక్తి కబ్జా చేసి అందులో చిన్నపాటి చెరువును తలపించేలా గుంటలు తవ్వించి, చెరువు మట్టిని అక్రమంగా తరలించారని, ఈ విషయంపై మత్స్య పారిశ్రమ సంఘం సభ్యులు కబ్జాదారున్ని ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని వినతి పత్రంలో వారు పేర్కొన్నారు. అధికారులు స్పందించి ముదిరాజ్ బిడ్డలకు జీవనాధారమైన చెరువును కాపాడి, చెరువును కబ్జా చేసి ఆక్రమించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వినతి పత్రం అందించిన వారిలో రామసముద్రం మత్స్య పారిశ్రామిక సంఘం చైర్మన్ జింకల హరిప్రసాద్, వైస్ చైర్మన్ పిట్టల ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శి గంపల సత్య నారాయణ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

మిర్యాలగూడ : విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని షీటీ ఎస్‌ఐ కోటేష్ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ షీటీం బృందం సభ్యులు దామరచర్ల మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలు, డ్రగ్స్, ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా డ్రగ్స్ వాడినా, అమ్మినా, విద్యార్థినులపై మహిళలపై అసభ్యంగా ప్రవర్తించినా వెంటనే పోలీసులకు డయల్100 ద్వారా సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐలు తబిత, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి పాటుపడాలి


కమిటీ సభ్యులను సన్మానిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

పెద్దవూర : దేవాలయ అభివృద్ధికి పాటుపడాలని పాలకమండలి సభ్యులు పాటుపడాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బోనూతల గ్రామ సమీపంలోని కోనేటిపురం శ్రీ తిరుమలనాథ స్వామి దేవస్థానం నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం, సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని పేర్కొన్నారు. తిరుమలనాథ స్వామి దేవస్థానం నూతన కమిటీ ఎన్నికకు సంబంధించి దేవాదాయ శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. దేవాలయ కమిటీ నూతన చైర్మన్‌గా బోనూతల గ్రామానికి చెందిన కల్లూరి వెంకటేశ్వర్‌రెడ్డి, పాలక సభ్యులుగా దండు భిక్షం, పగడాల మంగమ్మ, మేగావత్ దశరథ, రామవత్ లచ్చీరాం, రాయప్రోలు మురళీశర్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి.చంద్రశేఖర్‌రెడ్డి, డీసీసీ చైర్మన్ శంకర్‌నాయక్, మాజీ ఎంపీపీ రమావత్ శంకర్‌నాయక్, పగడాల నాగరాజు, మాజీ ఉప సర్పంచ్ పాకాల ఎల్లయ్య, లాలు, హనుమ, నాగరాజు, దేవాదాయ శాఖ అధికారులు రమేష్, సాంభయ్య తదితరులు పాల్గొన్నారు.

నిధులు చెల్లించడంలో ప్రభుత్వం విఫలం


వేములపల్లి : అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు

మిర్యాలగూడ : ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న దామరచర్ల మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లను శుక్రవారం వాడపల్లి పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శ్రీనునాయక్ మాట్లాడుతూ 12ఏళ్లుగా ప్రభుత్వాలు చేసిన పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో తాము ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచ్‌లు ప్రకాశ్‌నాయక్, శేఖర్, లింగ, సచిన్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వేములపల్లి : గ్రామాభివృద్ధి పనుల కోసం వెచ్చించిన బిల్లులను విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సర్పంచ్‌ల సంఘం జిల్లా నాయకుడు చిర్ర మల్లయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీ ముట్టడిలో భాగంగా వెళ్తున్న మండల మాజీ సర్పంచ్‌లను వేములపల్లి పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, కర్ర ఇంద్రారెడ్డి, మారుతి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం


రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

చింతపల్లి : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మెస్‌యూపీ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించడం హర్షణీయమన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గోవిందు రవి, నాయకులు భీమనమోని కొండల్, కోటేష్, సురేష్, నరేష్, సన్ని,రాములు, శ్రీధర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి


గుర్రంపోడు : దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈఓ

గుర్రంపోడు : కొత్తగా పాసుపుస్తకాలు వచ్చిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 5తేదీ గడువు ముగుస్తుందని రైతులు త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి జితేందర్ గౌడ్ అన్నారు. గురువార రైతు వేదికలో క్లస్టర్ రైతుల సమావేశంలో మాట్లాడారు. బీమా పొందని రైతుల జాబితాను రైతు వేదిక వద్ద ప్రదర్శించడం జరిగిందన్నారు. రైతులు తగు ధ్రువ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అడవిదేవులపల్లి : మండలానికి చెందిన రైతులు బీమా కోసం దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు మహేష్‌నాయక్, రావుల నరేష్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ నెల 5వ తేదీ వరకు అవకాశం ఉన్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు తదితరులున్నారు.

నేత్రదానంతో మరొకరికి చూపు


మృతురాలి కుటుంబ సభ్యులకు నేత్రదాన పత్రాలు అందజేస్తున్న డైమాండ్ నేత్ర నిధి ప్రతినిధులు

మిర్యాలగూడ అర్బన్ : నేత్రదానంతో మరోకరికి చూపు వస్తుందని వాసవిక్లబ్ రీజియన్ చైర్మన్ సామ శ్రీనివాస్ అన్నారు. మిర్యాలగూడ పట్టణం వాసవికాలనీకి చెందిన చీదళ్ల కళావతి మరణించడంతో వాసవిక్లబ్ గవర్నర్ రాచర్ల కమలాకర్ మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆయన ప్రోత్సాహంతో కుటుంబ సభ్యులు శుక్రవారం నేత్రాలను దానం చేందుకు ముందుకు వచ్చారు. దీంతో వాసవిక్లబ్ ప్రతినిదులు నేత్రాలను డైమాండ్ నేత్ర నిధికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు మిట్టపల్లి విజయభాస్కర్‌రావు, మాశెట్టి శ్రీనివాస్, ఓరుగంటి శ్యామ్‌సుందర్, యానగండ్ల లింగయ్య, వెంకటేశ్వర్లు, ఐ టెక్నీషియన్ రమేష్ తదితరులున్నారు.

ఇరిగేషన్ ప్రాజెక్టులను పట్టించుకోని బీఆర్‌ఎస్

దేవరకొండ : దేవరకొండ, మునుగోడు నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నం ఎస్‌ఎల్‌బీసీ, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను రాష్ట్ర ప్రభుత్వం పదేళ్లలో పట్టించుకోలేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. శుక్రవారం పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. దేప సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు రమావత్ అంజయ్య నాయక్, పల్లె నర్సింహా, పల్లా దేవేందర్‌రెడ్డి, పార్లపల్లి కేశవరెడ్డి, నూనె రామస్వామి, వలమల్ల ఆంజనేయులు, జూలూరి వెంకట్రాములు, పల్లా రంగారెడ్డి పాల్గొన్నారు.

సాయినాథుడిని దర్శించుకున్న శ్రీధర్‌స్వామి


సాయినాథుడికి హారతి ఇస్తున్న శ్రీధర్‌స్వామి

చింతపల్లి : మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడి దేవాలయంలో ముక్కమల క్షేత్ర పీఠాధిపతి శ్రీధర్‌స్వామిజి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్న హారతితో పాటు సాయినాథుడి ఆలయ ప్రాంగణంలోని గోశాలలో గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణనాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికి పూలమాల, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనుంజయ, కొమిరిశెట్టి వెంకటయ్య కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

10తేదీ వరకు 'మలబార్'లో చైన్ మేళా


మలబార్ గోల్డ్ షోరూంలో చైన్ మేళాను ప్రారంభిస్తున్న బ్రాంచ్ మేనేజర్ సంపత్

మిర్యాలగూడ : అంతర్జాతీయ ఆభరణాల వ్యాపార సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో ఈనెల 2 నుంచి 10 వరకు చైన్ మేళా నిర్వహిస్తున్నట్లు మిర్యాలగూడ షోరూం బ్రాంచ్ మేనేజర్ సంపత్ అన్నారు. శుక్రవారం చైన్ మేళా కార్యక్రమాన్ని అడ్వకేట్, బిజినెస్ ఉమెన్ శ్రావణి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి ఆభరణాల షాపింగ్ అనుభూతిని ఆస్వావదించేలా కేవలం 4.9శాతం నుంచి సహేతుకమైన వాల్యూ ఎడిషనతో హెచ్‌యూఐడీ హాల్‌మార్క్ చేయబడిన అద్భుతమైన చైన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. టైమ్‌లెస్ క్లాసిక్స్ నుంచి సమకాలీన డిజైన్ల వరకు అన్ని రకాల ఆభరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ మేళాలో బంగారు ఆభరణాల వాల్యూ ఎడిషన్‌పై 25శాతం తగ్గింపు, స్టడెడ్ జ్యువెలరీ వాల్యూ ఎడిషన్‌పై ఫ్లాట్ 25శాతం తగ్గింపు, వజ్రాల విలువపై 25శాతం తగ్గింపు ఆఫర్లు ఈనెల 4 వరకు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రసన్న, లత, తేజస్విని, కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

దేవరకొండ : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పాల్యా సురేష్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా విస్మరించడం ఆందోళనకు గురిచేస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ నుండి 8మంది ఎంపీలను గెలిపించినా నిధుల కేటాయింపులో రాష్ట్రాన్ని పరిగణలోకి తీసుకోలేదని తెలిపారు. రూ.48లక్షల కోట్ల బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒరిగిందే మి లేదని అన్నారు.కేంద్ర నిర్వహణ రంగాలను నిధుల లేమితో దెబ్బతీశారని ఆయన ఆరోపించారు.